క్లుప్తంగా

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొమ్మాది: రుషికొండ బీచ్ రోడ్డు శ్రీ మహాలక్ష్మి, గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సాయంత్రం శ్రీవారి సంకీర్తనలు, కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మొగదారమ్మకు సహస్ర తులసి అర్చన



కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్‌లో శ్రీ మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో శనివారం సహస్ర తులసి అర్చన నిర్వహించారు. ముందుగా అమ్మవారిని వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు.

నేడు మెగా కంటి వైద్యశిబిరం

పీఎం పాలెం: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లవ్ ఎన్ కేర్ మినిస్ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.ఏసుపాదం తెలిపారు. పీఎం పాలెంలోని బేతనీ స్కూలులో నిర్వహించే ఈ శిబిరానికి 10 మంది కంటివైద్య నిపుణులు హాజరవుతారన్నారు. పరీక్షల అనంతరం ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్ల అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. మధురవాడ, కొమ్మాది తదితర ప్రాంతాలలో కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారు తమ ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు వెంట తీసుకురావాలని కోరారు.

సంగివలస కాలనీలో చోరీ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంగివలస కాలనీలోని ఎం్రెడ్డి కాశీపతిరెడ్డి అనే విశ్రాంత బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. మూడు తులాల బంగారం, రూ.15వేల నగదు, 15 తులాల వెండి ఆభరణాలను చోరీకి గురయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు నగరంలో వైద్యం కోసం గురువారమే వెళ్లారు. శుక్రవారం పక్కింటి వాళ్లు ఫోన్ చేసి ఇంటి తలుపులు, బీరువాలు తెరచి ఉన్నట్టు సమాచారం అందించడంతో వారు వచ్చి చూసేసరికి ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

తగరపువలస: ఎన్నికల ముందు ప్రభుత్వం భీమిలి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు డిమాండ్ చేశారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. చిట్టివలస రైతు బజారు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.


సిమెంట్ బెంచీల ఏర్పాటు

భీమునిపట్నం: భీమిలిలో మత్స్యకారులు నివసించే తోటవీధి ప్రాంతంలో శనివారం దివీస్ సంస్థ రూ.77వేలు విలువైన సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసింది. సంస్థ సీఎస్ఆర్ మేనేజర్ సురేష్‌కుమార్, దివీస్ ప్రతినిధులు శ్రీనివాస్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

మన రాజ్యాంగం విశిష్టమైనది

పద్మనాభం: మన రాజ్యాంగం విశిష్టమైనదని బీజేపీ మండల యువమోర్చా అధ్యక్షుడు హంస మహేష్ అన్నారు. పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెంలో శనివారం భారత రాజ్యాంగ సంవిధాన అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం విశిష్టతను తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు.

రహదారి భద్రతపై ర్యాలీ



రేవిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం సభ్యులు

పద్మనాభం: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రేవిడిలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, అదుపు తప్పిన వేగంతో ప్రయాణించకూడదని అవగాహన కల్పించారు. ఎన్‌వైకే సభ్యుడు టి.మధు, శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం, డొక్కా సీతమ్మ యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శత వసంతాల చదువుల కోవెల

భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది వేడుకలకు ముస్తాబవుతోంది. చారిత్రకంగా, ఐతిహాసికంగా ఎంతో చరిత్ర కలిగిన భీమునిపట్నంలో బ్రిటిషర్ల కాలంలో ఈ హైస్కూల్‌ను నిర్మించారు. సాధారణంగా పాఠశాల వార్షికోత్సవమంటేనే విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు ఎంతో పండగ. మరి వందేళ్ల సంబరమంటే అంబరాన్నంటాల్సిందే. అందుకు అనుగుణంగానే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు నిర్వహణ కమిటీ సభ్యులు.

- భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వందేళ్లు
- శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన పూర్వ విద్యార్థులు



ప్రారంభంలోని పాఠశాల భవనం గదులు (ప్రస్తుతం జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు)

ఇదీ షెడ్యూల్

రెండు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో ఫిబ్రవరి ఒకటో తేదీ మొదటి రోజున ఊరేగింపు నిర్వహించడంతో పాటు పాఠశాలలో నిర్మించిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అలాగే తమకు విద్యను అందించిన ఉపాధ్యాయులను సత్కరించడం, పూర్వ విద్యార్థులందరు కలుసుకుని పరిచయాలు చేసుకోవడం ఉంటుంది. రెండో తేదీ ముగింపు రోజున అందరు సమావేశం కావడం, సరదాగా గడపడం, చివరికి ముగింపు కార్యక్రమం ఉంటుంది.



ప్రస్తుత ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటై వంద సంవత్సరాలు పూర్తయింది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాల శతాబ్ది ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహించడానికి పూర్వ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించి సన్నాహాలు చేస్తున్నారు.

అలా మొదలైంది..

1924వ సంవత్సరంలో అప్పటి పాలకులైన బ్రిటిష్ వారు మున్సిపల్ ఉన్నత పాఠశాలను నిర్మించాలని సంకల్పించారు. పాఠశాల నిర్మాణానికి అనుకూలంగా ఉందని భావించిన ప్రాంతంలో పారిశుద్ధ్య కార్మికుల పూరిళ్లు ఉండేవి. దీంతో మరో ప్రాంతంలో వారికి స్థలాలను కేటాయించి, పాఠశాలను నిర్మించారు. అప్పట్లో ఈ ప్రాంతాన్ని వైజాగ్ పటంగా పిలిచే వారు. నాటి కలెక్టర్ జి.టి.హెచ్.బ్రాకెన్ పాఠశాలను ప్రారంభించారు. అప్పుడు భీమిలి మున్సిపాల్టీ చైర్మన్‌గా చిలకా సంజీవరావు (సీఎస్ రావు)నాయుడు ఉన్నారు.

హెచ్ ఆకారంలో నిర్మాణం

ఈ పాఠశాల హైస్కూల్ కావడంతో దీన్ని హెచ్ ఆకారంలో నిర్మించారు. దాని రెండువైపులా ఉన్న భవనాల గదుల్లో తరగతులు జరిగేవి. 1968లో ఇందులో ఇంటర్మీడియట్‌ను ప్రవేశ పెట్టారు. ఇదే భవన గదుల్లోనే ఇంటర్ తరగతులు జరిగేవి. కొంత కాలానికి ఈ పాఠశాలను ప్రభుత్వ రంగంలోకి మార్పు చేసి ప్రభుత్వ పాఠశాలగా మార్పు చేయడంతో, అదే ప్రాంగణంలో కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించి పాఠశాలను అందులోకి తరలించారు. అప్పటి నుంచి పాత పాఠశాల భవనాల్లో జూనియర్ కళాశాల నిర్వహణ జరుగుతోంది. 2024 వ సంవత్సరానికి పాఠశాల నిర్మించి వందేళ్ల పూర్తయ్యాయి.

ఇక్కడ చదివి ఉన్నత స్థాయికి..

ఈ పాఠశాలలో చదువుకున్న ఎంతోమంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. 1993 నుంచి 1996 వరకు 8,9,10 తరగతులు చదివిన జి.క్రాంతికుమార్ ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్ర ఐజీగా ఉన్నారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మీసాల మాధవరావు, బీఎస్‌ఎఫ్ కమాండెంట్‌గా చేసిన కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ పూసర్ల గోపాలరావు, ఇన్‌కం ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ ఎంవీ మహీధర్, రిటైర్డ్ తహసీల్దార్ బండారు రామకృష్ణతో పాటు మరెందరో డాక్టర్లు, ఇంజినీర్లు, ఇతర ఉన్నత స్థాయిల్లో పని చేసినవారు ఉన్నారు. ఈ పాఠశాలలో చదువుకున్న అవనాపు అప్పలనాయుడు ఈ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేయగా, చిల్ల సూర్యనారాయణరెడ్డి ప్రధానోపాధ్యాయునిగా చేయడం విశేషం.

ఫిబ్రవరి 1, 2 తేదీల్లో శతాబ్ది వేడుకలు

పాఠశాల శతాబ్ది వేడుకలను ఫిబ్రవరి 1,2 తేదీల్లో నిర్వహించడానికి ఈ ప్రాంతంలో ఉన్న పూర్వ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. అందరూ కలిసి ఉత్సవ కమిటీగా ఏర్పాటయ్యారు. రెండు నెలలుగా ఉత్సవ నిర్వహణపై కసరత్తు చేస్తున్నారు. శతాబ్ది వేడుకలకు చిహ్నంగా పైలాన్‌ను నిర్మిస్తున్నారు. ఎక్కడెక్కడో ఉన్న పూర్వ విద్యార్థులకు ఈ సమాచారాన్ని చేరవేయడంతో సుమారు 500 మందికి పైగా వేడుకలకు హాజరవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ పరంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహకారం అందిస్తున్నారు. సుమారు రూ.20 లక్షలతో ఉత్సవాల నిర్వహణకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో ఖర్చులు పోను మిగిలిన మొత్తంతో పాఠశాల కోసం ఏదైనా చేయాలని సంకల్పించారు.



పాఠశాలలో నిర్మిస్తున్న పైలాన్

జ్ఞాపకాల దొంతర



పాఠశాలలో చదివిన 1966-67 బ్యాచ్ 6వ తరగతి విద్యార్థులు



1983-86 బ్యాచ్ విద్యార్థులు

ఇక్కడ చదివి.. ఇక్కడే హెచ్‌ఎంగా..



నేను ఈ హైస్కూల్లో 1975-76 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివాను. తరువాత ఉపాధ్యాయునిగా పలు ప్రాంతాల్లో పని చేసినా.. నేను చదివిన పాఠశాలలోనే 2019 నుంచి 2021 వరకు ప్రధానోపాధ్యాయునిగా పని చేసే అదృష్టం కలిగింది. ఇక్కడ చదివి, ఇక్కడే పని చేసే అరుదైన అవకాశం నాకు రావడం ఎంతో గర్వంగా అనిపిస్తుంది. మేం చదువుకున్న రోజులు తలచుకుంటే ఎంతో ఆనందంగా అనిపిస్తుంది.

– సిహెచ్.సూర్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, వలందపేట, భీమిలి

ప్రత్యేక అభిమానం



1964–67 విద్యా సంవత్సరాల్లో పాఠశాలలో ఎనిమిది నుంచి పదో తరగతి వరకు చదువుకున్నాను. ఈ ప్రాంతమన్నా, పాఠశాల అన్నా ప్రత్యేక అభిమానం. ఇక్కడికి వస్తే తప్పకుండా పాఠశాల చూసే వెళ్తాను. మేం చదువుకున్న రోజులు మరపురానివి. ఆ రోజులు తలచుకుంటే ఇప్పటికీ ఎంతో హాయిగా అనిపిస్తుంది.

– పూసర్ల గోపాలరావు, ఈఎన్‌టీ వైద్య నిపుణుడు, విజయనగరం

గుర్తుకొస్తూనే ఉంటాయి



ఉద్యోగ రీత్యా ఎన్నో ప్రాంతాలకు వెళ్లినా ఈ పాఠశాలలో మూడు సంవత్సరాల పాటు చదివిన రోజులు ఇప్పటికీ గుర్తొస్తుంటాయి. 1964–67 సంవత్సరాల్లో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివాను. అప్పట్లో ఇక్కడ తోటి విద్యార్థులతో ఆడుకోవడం, చేసిన అల్లరి పనులు తలచుకుంటే మళ్లీ చిన్నపిల్లలమే అవుతాం. ఆ జ్ఞాపకాలను అందరితో పంచుకుంటూ ఉంటే ఆ ఆనందమే వేరు.

– మీసాల మాధవరావు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ, విజయనగరం

ఘనంగా ఏర్పాట్లు



పాఠశాల శతాబ్ది ఉత్సవాలంటే మాకు పెద్ద పండగ. పాఠశాలలో చదివిన ప్రతి ఒక్కరికీ ఈ వేడుకలు గుర్తుండిపోయేలా ఘనంగా నిర్వహించాలని అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. దీనికోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశాం. ఉత్సవాల ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు అందులోనే చర్చిస్తున్నాం. అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– మైలపల్లి లక్ష్మణరావు, ఉత్సవ కమిటీ కార్యదర్శి

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం



తాటితూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయుడు



కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల విద్యార్థులకు జ్ఞాపిక అందిస్తున్న జేసీ మయూర్ అశోక్



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు శ్రీవాణి

తగరపువలస: ప్రజాస్వామ్య వ్యవస్థపై భారతదేశ పునాది ఉందని ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకమని పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, స్థానికులతో శనివారం ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటర్లుగా నమోదై, ప్రజాస్వామ్యానికి అండగా నిలబడాలన్నారు. ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ఓటుహక్కుపై అవగాహన కల్పించారు.

- భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎంవీటీ రత్నం విద్యార్థులకు అవగాహన కల్పించారు.
- తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో ఓటర్ల దినోత్సవంలో ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.
- ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల విద్యార్థులు ఓటు విలువపై నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవాని శంకర్, ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఎన్.వి.డి ఆకారంలో రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

- ఓటు హక్కును తప్పక వినియోగించుకుందామంటూ చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానోపాధ్యాయిని పి.శ్రీవాణి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

భీమునిపట్నం: ఓటు హక్కు విలువ తెలుసుకుని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దారు రామారావు అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

చంద్రంపాలెం హైస్కూల్లో..

మధురవాడ: ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఓటు చాలా కీలకమైందని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని సుమారు వెయ్యిమంది విద్యార్థులు ఓటు గుర్తు అయిన స్వస్తిక్ ఆకారంలో నిలబడ్డారు. సోషల్ ఉపాధ్యాయుడు మోహనరావు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రెడ్డిపల్లి హైస్కూల్లో..

పద్మనాభం: రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఎన్‌వీడీ (నేషనల్ ఓటర్స్ డే) ఆకారంలో ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ముగ్గురు వృద్ధులను తహసీల్దార్ ఆనందరావు సన్మానించారు. రంగోలి, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎం.సన్యాసిరావు, ఆర్ఐ శ్యామల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహత్తర కావ్యం రామాయణం

- మనిషిని సంస్కారవంతంగా తీర్చిదిద్దే మహాగ్రంథం
- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు




ప్రవచిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: రామాయణం మహత్తర కావ్యమని ప్రవచన చక్రవర్తి బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మనిషిని సంస్కారవంతంగా తీర్చిదిద్దడమే కాకుండా నైతిక విలువలు, నియమాలు నేర్పిస్తుందన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో శ్రీ అష్టలక్ష్మి, వైశాఖేశ్వర స్వామి ఆలయం, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సంపూర్ణ రామాయణంపై 42 రోజుల పాటు ఏర్పాటు చేసిన ప్రవచనాలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీ రామాయణం వైభవం, వాల్మీకి మహర్షి, గురువు గొప్పదనం గురించి తెలిపారు. రామాయణం ఆది కావ్యమని, దీనిని మించిన గొప్ప కావ్యం లేదని తెలిపారు. శ్రీ రాముడు నడవడియే ధర్మమని పేర్కొన్నారు. భగవంతుని ఉనికి తెలియాలన్నా గురువు ద్వారానే సాధ్యం అవుతుందన్నారు. తాను చదువుకుని, ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది విశాఖపట్నము నుంచేనని, తనికి విశాఖ అంటే ప్రత్యేక మమకారం అని చెప్పారు. విశాఖలో మూడో సారి సంపూర్ణ రామాయణ ప్రవచనం చేయడం రామానుగ్రహమని సంతోషం వ్యక్తం చేశారు. తొలుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజు చాగంటికి పూలమాలలు వేసి, సత్కరించారు. కార్యక్రమానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు.

సంతపేటలో ఫాగింగ్

తగరపువలస:మలేరియా నివారణ సిబ్బంది 1,2 వార్డుల్లో శనివారం ఫాగింగ్ చేశారు. సంతపేట గొల్లవీధి, కుమ్మరవీధి, ఆదర్శనగర్ ప్రాంతాలలో డ్రైనేజీలు, ఇళ్ల మధ్య ఫాగింగ్ చేసి, స్థానికులకు పలు సూచనలు చేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నేల లేకుండా నీటిలో పెరిగే మొక్కల ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థి

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలోని స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రదర్శనను పాఠశాల వ్యవస్థాపకుడు ఆర్.డి.రతన్‌రాజు ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వంద ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో నేల లేకుండా నీటిలో పెరిగే మొక్కలు, అంతరిక్ష యాత్ర వంటి ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వచ్చినవారికి బీపీ, షుగర్, బ్లడ్ గ్రూప్ వంటి పరీక్షలు నిర్వహించారు. 16 పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ ఆలీవర్ రాయ్ పర్యవేక్షించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భీమునిపట్నం:భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద శనివారం చెస్ పోటీలు నిర్వహించారు. శతాబ్ది ఉత్సవాలకు ముందు పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు చెస్, క్యారమ్స్ పోటీలను ఉత్సవ కమిటీ నిర్వహించింది. ఉత్సవ కమిటీ కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ముఖ్య సభ్యులు మైలిపల్లి షణ్ముఖరావు, కె.ముత్యాలరావు, కాళ్ల సన్నీ, టి.భీమారావు, పార్వతీశం పాల్గొన్నారు.